ప్రజాశక్తి
బుధవారం 10 మే 2023
5
పార్వతీపురం మన్యం



నేడు మంత్రి బొత్స రాక

మామిడిపల్లిలో సువ్వాడ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ మండలంలోని మామిడిపల్లి గ్రామానికి బుధవారం రానున్నారు. డిప్యూటీ సిఎం పి.రాజన్నదొరతో కలిసి ఆయన మాజీ వైస్ ఎంపిపి సువ్వాడ తవుడు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు .సువ్వాడ తవుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అనేక పదవులు పొందారు. గ్రామ పంచాయతీగా సర్పంచ్, పిఎసిఎస్ అధ్యక్షుడిగా, మండల పరిషత్ ఉపాధ్యక్షులుగా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన కుమారుడు, వైసిపి సేవాదళ్ జిల్లా అధ్యక్షులు సువ్వాడ రామకృష్ణ ఆధ్వర్యాన ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమం జరుగనుంది.

సం'క్షేమం'కాని భూములు

- జగనన్న లేఅవుట్ల కేటాయింపుల్లో రెవెన్యూ అధికారుల వివక్ష
- అమ్మకానికి అనువైనవి.. పేదలకు ఉపయోగం లేనివి
- రియల్ వ్యాపారం చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్ర ప్రభుత్వం మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగుల కోసం నిర్దేశించిన ఎంఐజ ప్లాట్ల అమ్మకాలకు రెవెన్యూ అధికారులు అనువైన ప్రభుత్వ భూమిని ఎంపిక చేశారు. జాతీయరహదారికి సంబంధించిన బైపాస్ రోడ్డును ఆనుకుని ఉన్న భూములను ప్లాట్ల కోసం సిద్ధం చేశారు. 14.87ఎకరాల భూమిని ఎంఐజి ప్లాట్ల కోసం సిద్ధంగా ఉంచారు. ఈ భూముల్లో రెండు లేఅవుట్లు వేసి 184ప్లాట్ల అమ్మకాలకు రంగం సిద్ధం చేసుకున్నారు. బొబ్బిలి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఆధ్వర్యాన ప్లాట్ల అమ్మకానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ భూములు ప్రభుత్వ భూములే అయినప్పటికీ రైతులు సాగులో ఉన్నందున వారి పరిహారం మంజూరు చేశారు. ఎకరాకు సుమారు రూ.20లక్షల చొప్పున రైతులకు చెల్లించి ఈ భూములను సేకరించారు. బైపాస్ రోడున్డు ఆనుకుని ఉన్న లేఅవుట్‌లో 109 ప్లాట్లను అభివృద్ధి చేసి విక్రయిస్తారు. ఒక చదరపు గజం స్థలం రేటు రూ.5వేలుగా నిర్ణయించారు. దుగ్ధసాగరం రోడ్డును ఆనుకుని ఉన్న లేఅవుట్‌లో 75ప్లాట్ల అమ్మకానికి పెట్టారు. ఈ లేఅవుట్‌లో చదరపు గజం రేటు రూ.4,800గా నిర్ణయించారు. ప్రభుత్వ రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం అనువైన భూములు సేకరించిన అధికారులు పేదల ఇళ్ల నిర్మాణానికి నిర్దేశించిన జగనన్న లేఅవుట్‌కు పనికిమాలిన భూములు సేకరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చంద్రప్పవలస టిడ్కో గృహ సముదాయాల వెనుక కేటాయించిన జగనన్న లేఅవుట్‌ను ప్రారంభించి ఇప్పటికే రెండేళ్లు పూర్తయ్యింది. సుమారు 1248 మంది పేదలకు ఇక్కడ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. వీరిలో కనీసం 30శాతం మంది కూడా ఇళ్లను పూర్తి చేయలేదు. ఈ భూములు కూడా ఎకరా రూ.20లక్షల చొప్పున కొనుగోలు చేశారు. లేఅవుట్‌లో కోట్లాది రూపాయలతో ఇంటర్నల్ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ, విద్యుత్, తాగునీటి సరఫరా వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. కానీ ఇంతవరకు ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తి కాలేదు. అధికారుల ఒత్తిడి మేరకు కొంతమంది పేదలు పునాదులు నిర్మించి వదిలేశారు. ఈ లేఅవుట్ తర్వాత ప్రారంభించిన నెలిపర్తి లేఅవుట్‌లో పేదల ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. కానీ జగనన్న లేఅవుట్ -5లో ఇళ్ల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. గతంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి రంగనాథ రాజు జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర కూడా రెండు సార్లు లేఅవుట్‌ను పరిశీలించి పేదలకు అవగాహన కల్పించేందుకు ప్రయత్నించారు. కానీ ఈ లేఅవుట్‌లో మట్టి గృహ నిర్మాణానికి అనువైనది కాదనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. అధికార పార్టీ నాయకుల అండదండలతో పేదల ఇళ్ల నిర్మాణానికి పనికిమాలిన భూములు సేకరించిన రెవిన్యూ అధికారులు, ఇప్పుడు ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మాత్రం అనువైన భూములు సేకరించారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.



జగనన్న స్మార్‌సిటీకి కేటాయించిన భూమి

సామాన్యుని ముఖంలో చిరునవ్వు చూడాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే ఆర్జీలను పరిష్కరించి సామాన్య మానవుని ముఖంలో చిరునవ్వు, ఆనందాన్ని చూడగలమని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, ఎస్‌పి విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్యే కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో ప్రతి మారుమూల గ్రామానికి కూడా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునే ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే పకడ్బందీగా అమలు చేసేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. కలెక్టర్, ఎస్‌పి ఆధ్వర్యంలో రెండు దఫాలు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించామని పేర్కొన్నారు. డివిజనల్ స్థాయి అధికారులు మండల స్థాయికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని తక్షణం పరిష్కరించడం జరుగుతుందని వివరించారు. ఏ మండలాల్లో ఎక్కువ అర్జీలు అందుతున్నాయి, అందుకు కారణాలు విశ్లేషిస్తున్నామని అన్నారు. వీటిని విశ్లేషించి మార్గదర్శకంగా ఉండేందుకు "రెడీ రెకనర్"ను కేస్ స్టడీలతో రూపొందిస్తున్నామని, సమస్య పరిష్కారానికి చక్కగా ఉపయోగపడుతుందని అన్నారు. జిల్లాలో రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణ అభివద్ధి శాఖలతో కలిసి ఆడిట్ బృందాన్ని, ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ముఖ్య మంత్రి స్థాయిలో పర్యవేక్షణ జరగడం, కార్యక్రమం ప్రాధాన్యతను అందరికీ వివరించినట్టు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో సమస్యల పరిష్కారానికి జిల్లాలకు ప్రత్యేక అధికారి నియామకం వంటి అంశాలు కార్యక్రమం విజయవంతం కావడానికి దోహదం చేస్తాయని అన్నారు. అలాగే వెబ్ సైట్ ద్వారా ఆర్జీ సమర్పణ చేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు, డిఆర్ఒ జె.వెంకటరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, పక్కన డిప్యూటీ సిఎం రాజన్నదొర, ఎస్‌పి విక్రాంత్‌పాటిల్, ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

సమస్యల పరిష్కారానికే 'జగనన్నకు చెబుదాం'

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖమంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి జిల్లా కలెక్టరు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ అర్హతను ప్రామాణికంగా తీసుకొని పారదర్శకంగా, అవినీతిరహితంగా పథకాలను అమలు చేస్తున్నామన్నారు. అయినా కొన్ని సమస్యలు వస్తున్నాయని, వాటి పరిష్కారానికి ముఖ్యమంత్రి కార్యాలయ స్థాయి నుంచి పర్యవేక్షించి, సంపూర్ణంగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల ప్రజా సమస్యల పరిష్కారంలో జవాబుదారీతనం, నాణ్యత పెరుగుతుందన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో సత్వర చర్యలకు, పర్యవేక్షణకు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో మోనటరింగు కమిటీలు పనిచేస్తాయని తెలిపారు. అంతా కలిసి జిల్లాను అభివృద్ధి చేసుకోవాలని, అందుకు అందరూ సహకరిస్తున్నారని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడినవారు ఈ ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములయ్యారని అన్నారు. రోడ్లు, వంతెనల నిర్మాణానికి అంతా సహకరించాలని, ఎవరైనా ఆటంకం కలిగించేందుకు ప్రయత్నిస్తే పనులను పూర్తిచేయుటకు చట్టపరంగా గల అన్ని అవకాశాలు వినియోగించుకొంటామని అన్నారు. కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు అలజంగి జోగారావు, మునిసిపల్ చైర్ పర్శన్ బోను గౌరీశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా సిరిమానోత్సవం

వేలాది మంది రాకతో కిక్కిరిసిన గ్రామాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని పైడితల్లి అమ్మవారి గ్రామ దేవత మహోవాల్లో భాగంగా మంగళవారం సిరిమానోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి బంధువులు, స్నేహితులు అమ్మవారి సిరిమానోత్సవానికి విచ్చేయడంతో ప్రధాన రహదారి కిక్కిరిసిపోయింది. ఏడేళ్ల తర్వాత గ్రామంలో అమ్మవారి పండగ నిర్వహించడంతో మూడురోజుల క్రితమే బంధువులు, స్నేహితులు వీరఘట్టం చేరుకోవడంతో గ్రామంలో ఏ వీధులో చూసినా ప్రజలతో దర్శనమిస్తున్నారు. బోయుడు, పాల జంగిడితో ఇంటి నుంచి మెయిన్ రోడ్డు మీదుగా పైడితల్లి అమ్మవారి ఆలయం వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి. ఆలయం వద్ద నుంచి ముందుగా అంజలి రథం, తర్వాత సిరిమాను నిర్వాహకులు ఒట్టిగెడ్డ వంతెన వరకు తోడుకొని వచ్చి అక్కడి నుండి అదే రహదారి గుండుగా కూరాకుల వీధి, టిబి చర్చి వరకు తోడుకొని ప్రధాన రహదారి మీదుగా బిఎంఆర్ థియేటర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు సిరిమాను తిరిగింది. ఘటాలతో పాటు వీరఘట్టానికి చెందిన శ్రీకృష్ణ సేవా సంఘ ఆధ్వర్యంలో బండ్ల వేషాలు వేయడంతో పలువురిని ఆకట్టుకున్నాయి. వీటిని వీక్షించేందుకు వేలాది మంది ప్రజలు విచ్చేశారు.

పటిష్టమైన పోలీసు బందోబస్తు

పైడితల్లి గ్రామదేవత మహోత్సవంలో భాగంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు పాలకొండ డిఎస్పి జీవీ కృష్ణారావు పర్యవేక్షణలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పార్వతీపురం నుండి వీరఘట్టం వైపు వచ్చిన ఆర్టీసీ బస్సులను తహశీల్దార్ కార్యాలయం వద్ద, అలాగే పాలకొండ నుండి వీరఘట్టం వైపు వచ్చిన ఆర్టీసీ బస్సులను వీరఘట్ట పెట్రోల్ బంకు వద్ద నిలిపివేశారు. వివిధ ప్రాంతాల నుండి పండగకు వాహనాలను నిలుపుదలు చేసేందుకు ప్రత్యేక స్థలాలు కేటాయించారు. ఈ మహోత్సవ కార్యక్రమంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారుతీసుకున్నారు.

అమ్మవారి దర్శించుకున్న ప్రముఖులు

పైడితల్లి అమ్మవారు గ్రామ దేవత మహోత్సవ భాగంగా పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, తోటపల్లి ప్రాజెక్టు మాజీ చైర్మన్ మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగ, తదితరులు పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారి షీల్డ్ బహుకరించారు.



పురవీధుల్లో తిరుగుతున్న బల్లవేషాలు



వీరఘట్టంలో ప్రధాన వీధిలో తిరుగుతున్న సిరిమాను

ఘనంగా భోగి తల్లి సినిమానోత్సవం

సీతానగరం : పెదబోగిలి, అప్పయ్యపేట బుడ్డిపేట సీతానగరం గ్రామాల్లో మంగళవారం జరిగిన భోగి తల్లి గ్రామ దేవత పండగ సందర్భంగా సినిమానోత్సవం ఘనంగా జరిగింది. ఈ సిరిమానోత్సవాన్ని మాజీ మంత్రి సుజయకృష్ణ రంగారావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బేబీ నాయనా దర్శించుకుని ప్రారంభించారు. వీరితోపాటు టిట్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్‌తో పాటు పలువురు రాజకీయ నాయకులు దర్శించుకున్నారు. సినిమానోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు పోలీసు శాఖ ఆధ్వర్యంలో తీసుకున్నారు. ఈ సినిమానోత్సవానికి భక్తులు పెద్దఎత్తున వచ్చారు. అలాగే జోగింపేట గ్రామ దేవత పండగ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



రెజ్లలర్లకు మద్దతుగా ర్యాలీ చేస్తున్న మహిళలు

రెజ్లర్లకు మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి - పాచిపెంట

దేశం గర్వపడేలా పతకాలు తెచ్చిన మహిళా క్రీడాకారులను బిజెపి ఎంపి బ్రిజు భూషణ్ లైంగిక దాడులను నిరసిస్తూ మండలంలోని తెట్టేడవలసవలసలో ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు పడాల ఎర్రమ్మ, వెంకటమ్మ మాట్లాడుతూ దేశానికి గర్వకారణమైన ఎన్నో పతకాలు అందించి దేశ ప్రతిష్టను నిలబెట్టిన క్రీడాకారులపై లైంగిక దాడులు చేసిన బిజెపి ఎంపి బ్రిజు భూషణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకొని, ఎంపి పదవి ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించాలని, మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. క్రీడాకారుల సమస్యలపై దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగినా నరేంద్ర మోడీ ప్రభుత్వానికి ఎటువంటి చలనంలేదని ఇప్పటికైనా మహిళలను గౌరవించాలని, చట్టాలను సక్రమంగా అమలు చేయాలని, ఇటువంటి వారిపైన యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆడపిల్లలకు, మహిళలకు భద్రత లేదని ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా జరిగిన ఘటనలే ఉదాహరణ అని అన్నారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాలు అత్యాచారం చేసిన వారికి రక్షణ కల్పిస్తున్నారని విమర్శించారు. దేశం గర్వించదగిన క్రీడాకారుల పైన లైంగిక దాడులు పాల్పడిన బ్రిజ్జు భూషణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

520 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

వాహన తనిఖీలో భాగంగా 520 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ సింహాద్రి నాయుడు మంగళవారం తెలిపారు. అక్రమంగా గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో బొడ్డవరం చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అరకు నుంచి ఎస్ కోట వైపు వస్తున్న టాటా ఏసీ వాహనంలో 520 కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. ఒడిస్సా రాష్ట్రం ముంచింగుపుట్టుకు చెందిన కృష్ణ, జోల పుట్టుకు చెందిన హాంతాల్ అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని గంజాయి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు కోటి రూపాయలు ఉంటుందని సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తారకేశ్వరరావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

10 కేజీ గంజాయితో ముగ్గురు వ్యక్తులు అరెస్టు

కొత్తవలస: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకొని కొత్తవలస పోలీసులు అరెస్ట్ చేశారు. సిఐ ఎస్ బాల సూర్యరావు తుమ్మికాపల్లి వద్ద వాహనాలు చెక్ చేస్తుండగా ఆర్టీసీ బస్సు దిగి వెళ్లిపోతున్న ముగ్గురును పోలీస్ సిబ్బంది వెంబడించి పట్టుకున్నారని సిఐ తెలిపారు. వారి వద్ద నుండి 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులను కోర్టులో హాజరపరిచామన్నారు. నిందితులు బాబీదేవి, అనిరుగ్ కుమార్, అంకేష్ కుష్వ కాగా మరొకరు పరారీలో ఉన్నారన్నారు. ఈ దాడిలో ఎస్ఐ బి. దేవి, సిబ్బంది పాల్గొన్నారు.



తనుశ్రీని అభినందిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర, కలెక్టర్ నిశాంత్‌కుమార్

విద్యార్థినులకు డిప్యూటీ సిఎం అభినందనలు

ప్రజాశక్తి -సాలూరు

ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల పదోతరగతి పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించి మూడో స్థానంలో నిలిచిన కర్రి షర్మిలను డిప్యూటీ సిఎం రాజన్నదొర, కలెక్టర్ నిశాంత్ కుమార్ అభినందించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక జ్యోతిరావుపూలే బిసి బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని కర్రి షర్మిల పదోతరగతి పరీక్షల్లో 585మార్కులు సాధించి మన్యం జిల్లాలో మూడో స్థానంలో నిలిచింది. దీంతో ఆమెను రాజన్నదొర, కలెక్టర్ దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్, డిఇఒ నిమ్మక రాజ్ కుమార్ పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక ఆదర్శ పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో నియోజకవర్గ స్థాయిలో 585 మార్కులు సాధించిన కర్రి తనుశ్రీకి మంగళవారం కలెక్టరేట్‌లో ఉప ముఖ్యమంత్రి పీడక రాజన్నదొర, కలెక్టర్ నిశాంత్ కుమార్ అభినందించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆరిక సుందరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 585 మార్కులు సాధించి పాఠశాలకు, సిబ్బందికి గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చినందుకు తనుశ్రీకి పాఠశాల తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సకాలంలో పనులు పూర్తి చేయించాలి

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వ ప్రాధాన్యత బిల్డింగ్ పనులు, గడపగడపకు కార్యక్రమం కింద మంజూరైన పనులు త్వరగతిగా పూర్తి చేయించాలని పంచాయతీరాజ్ ఇఇ ఎంవిఆర్ కృష్ణాజీ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీరాజ్ జెఇ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మండలంలో జరుగుతున్న పనులను పంచాయతీ వారీగా సమీక్షించారు. ప్రతి పంచాయతీలో పనులను ఆగస్టు నాటికి పూర్తి చేయించాల్సిన బాధ్యత ఇంజనీరింగ్ అసిస్టెంట్లు దేనిని సూచించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పిఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

రఘు కళాశాలకు నాక్ ఎ- ప్లస్ గ్రేడ్ గుర్తింపు

విజయనగరం : రఘు ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన నాక్ ఎ-ప్లస్ గ్రేడ్ గుర్తింపు లభించినట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు తెలిపారు. మంగళవారం ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెలలో కళాశాలను సందర్శించిన నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (నాక్) నిపుణుల బృందం రెండు రోజుల పాటు కళాశాలలో మౌళిక వసతులు, మానవ వనరులు, ప్రయోగశాలలు వంటివి ప్రత్యక్షంగా పరిశీలించి. అత్యుత్తమ ర్యాంకును అందించాయని తెలిపారు. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు కళాశాలకు చేరాయని చెప్పారు. ఇప్పటికే రఘు ఇంజినీరింగ్ కళాశాల అటానమస్ గుర్తింపు, ఎన్‌బిఎ గుర్తింపును సైతం కలిగి ఉందని, ప్రస్తుతం నాక్ ఎ-ప్లస్ గుర్తింపుతో కళాశాల ప్రమాణాలు అత్యుత్తమంగా ఉన్నట్లు స్పష్టమయ్యాయని తెలిపారు. నాక్ 4.0 స్కేల్ పై తమ కళాశాలకు 3.35 మార్కులను పొంది, ఎ-ప్లస్ గ్రేడిని సాధించిందన్నారు. కంప్యూటర్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాలలోని రీసెర్చ్ సెంటర్లు జెఎన్‌టియు గుర్తింపును సైతం కలిగి ఉన్నాయన్నారు. అత్యున్నత ప్రమాణాలతో విలువలతో కూడిన విద్యను అందిస్తూ, నూతన విద్యా విధానంలో సూచించేలా విలువైన మానవ వనరులుగా తీర్చిదిద్దే దిశగా రఘు విద్యాసంస్థలు. పనిచేస్తున్నా యన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాసు పాల్గొన్నారు.

12న పాడి రైతుల సదస్సు

ప్రజాశక్తి - సీతానగరం

ఈనెల 12న పార్వతీపురం ఎన్‌జిఒ హోంలో పాడి రైతుల సదస్సు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పాడి రైతుల సమస్యలను చర్చించి, భవిష్యత్తు కార్యక్రమం చేపడతామన్నారు. ఈ సదస్సులో పాడి రైతుల అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గిరిజన గ్రామాల పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని అటవీ శాఖ పరిధిలో గల గిరిజన గ్రామాల్లో గిరిజనులకు ఇళ్లు మంజూరు చేసేందుకు పులిగుమ్మి , సీది గూడ, అమ్మ చెరువు, కోపిరిడంగు, కుడ్డపల్లి గ్రామాలను పాలకొండ సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్ మంగళవారం పరిశీలించారు. ఈ గ్రామాల్లో గిరిజనులు నివసించిన ప్రదేశాలను అటవీ, రెవెన్యు శాఖ పరిధిలోనికి మార్చడానికి ప్రతిపాదనలు తయారు చేసి డివిజనల్ కమిటీలో చర్చించనున్నారు. అనంతరం జిల్లా కమిటీకి సిఫార్సు చేసి ఆయా ప్రాంతాలల్లో నివాసము ఉంటున్న గిరిజనులకు పొజిషన్ సర్టిఫికేట్ ఇచ్చి ప్రభుత్వం వారి నుంచి ఇళ్లు కట్టుకొనే అవకాశం కల్పించనున్నారు. సుమారు 40 గ్రామాలు అటవీ ప్రాంతం నుంచి రెవెన్యూ ప్రాంతంగా మార్చడానికి ప్రతిపాదనలు తయారు చేశారు. ఇందులో భాగంగా మంగళవారం ఈ గ్రామాలను సందర్శించారు. ఈ పరిశీలనలో తహశీల్దార్ నరసింహమూర్తి, ఆర్ఐ వెంకటేష్, సర్వేయర్ శివ తదితరులు పాల్గొన్నారు.



భూరికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

తాగునీటి సమస్యపై మహిళల నిరసన

పార్వతీపురంరూరల్ : మండలంలోని సంగంవలస పంచాయతీ సీతంపేట గిరిజన గ్రామంలో గత కొద్దిరోజులుగా చేతిపంపు మరమ్మతుకు గురికావడంతో తాగునీటికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ సమస్యను ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆగ్రహం చెందిన గ్రామస్తులు మంగళవారం ఖాళీ బిందెలతో సంగంవలస పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఉపసర్పంచ్ శ్రీరంజని స్పందించి వెంటనే గ్రామీణ నీటిసరఫరా అధికారులకు తెలియజేసి వెంటనే బోరుమరమ్మత్తులు చేస్తానని తెలపడంతో వారు వెనుదిరిగారు.



వైద్యాధికారికి వినతిని అందజేస్తున్న 104 సిబ్బంది

సమస్యలపై వైద్యాధికారికి వినతి

కురుపాం : మండలంలో కిచ్చాడలో 104 ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో వైద్యాధికారి శ్రీధర్‌కు డేటా ఆపరేటర్ ఎం.అరవింద్, డ్రైవర్ మాధవరావు తమ సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంటి ముంగిటనే మెరుగైన వైద్యసేవలు అందాలనే ఉద్దేశంతో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 104ఎంఎంయు వాహన సేవలు 2005లో ప్రారంభించారన్నారు. అప్పటి నుంచి 104 ద్వారా గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అప్పటి పాదయాత్రలో 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు అమలు చేసి ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పటి వరకు ఎటువంటి స్పష్టమైన హామీ రాలేదన్నారు. కావున ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించేలా ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని కోరుతూ వైద్యాధికారికి తమ సమస్యలపై వినతిపత్రం అందించామని తెలిపారు.



గ్రామస్తులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

ఏజెన్సీలో గడపగడపకు...

సీతంపేట : మండలం కొత్తం సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వి.కళావతి పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ అమలు తీరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ఊపిరిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జనరంజక పాలనను అందిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం కన్నా ఎంతో మిన్నగా పేదల జీవన ప్రమాణాలను పెంచడమే లక్ష్యంగా సిఎం జగన్ కృషి చేస్తున్నారని అన్నారు. పేదలకు ఎలాంటి పథకాలు, అవసరమో వాటిని మాత్రమే అమలు చేస్తూ మంచి పాలన అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి, ఆదివాసీ వింగ్ జెడ్పీటీసీ లక్ష్మి, వైస్ ఎంపీపీలు, విజయలక్ష్మి సరస్వతి, వైసిపి నాయకులు రాము, ఎంపిడిఒ, కొండపల్లి సత్యం, ఎపిఒ, సాగర్, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, మండల అధికారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ, వాలీబాల్ పోటీలు

వీరఘట్టం : పైడితల్లి అమ్మవారి గ్రామ దేవత ఉత్సవాల సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు దిగ్విజయంగా ముగిశాయి. ఆఖరి ఈ పోటీలను వీక్షించడానికి శ్రీకాకుళం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ముఖ్య సలహాదారు పెంకి సుందరావు, శ్రీకాకుళం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి యాళ్ల పోలినాయుడు, జాయింట్ సెక్రెటరీ రామచంద్రుడు, ట్రెజరర్ తెంటు రవి హాజరయ్యారు. వాలీబాల్, కబడ్డీ పోటీల్లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో విజేతలకు బహుమతులను స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ అందజేశారు. న్యాయనిర్ణేతలుగా మజ్జి రామకృష్ణ, ఎస్.వెంకటరమణ, బి.సతీష్, హరిబాబు, సాల్మన్‌రాజు, వి.మధు, శివరాం, ప్రసాద్, రమేష్, రాజు, సురేష్, రాము వ్యవహరించారు. ఆర్గనైజర్లుగా స్థానిక హైస్కూల్ పిడి సిర్లాపు ఉమామహేశ్వరరావు, సీనియర్ ఆర్‌ఎంపి పిఇటి రాయిపల్లి రత్నాకర్‌రావు, కింగ్‌స్టార్ యూత్ వ్యవహరించారు.



గెడ్డలో పూడికలను తీస్తున్న ప్రొక్లెయిన్

కొనసాగుతున్న వరహాలగెడ్డలో పూడికతీతలు

పార్వతీపురం టౌన్ : పట్టణంలో గల వరహాలగెడ్డలో పేరుకుపోయిన గుర్రపు డెక్కలను, ఇతర మొక్కలను, చెత్తాచెదారం, వ్యర్థాలతో పేరుకుపోయిన పూడికతీతలు జెసిబితో తొలగించే పనులు కొనసాగుతూనే ఉన్నాయి. రానున్న వర్షాకాలం దృష్ట్యా ఈ పూడికలు తొలగించడం జరుగుతోంది. దీంతో పాటు వరహాల గెడ్డ పరిసరాలలో ఆక్రమణలను కూడా తొలగించడం జరుగుతుంది. వరహాల గెడ్డలో చెత్త వేయడం, ఆక్రమణలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు ఆదేశాల మేరకు ప్రజారోగ్య శాఖ అధికారి సిహెచ్ మురళి ఆధ్వర్యంలో పరిధిలో ఉన్న సచివాలయాల శానిటరీ సెక్రెటరీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఏజెన్సీలో 'ఇదేం ఖర్మ'

సీతంపేట : మండలంలోని తాడిపాయి పంచాయతీ జయపురం, జయపురం గూడ, తాడిపాయి, గాడిదపాయి, పొల్లంగూడ, జబ్బుగూడ, చదునుగూడ గ్రామాల్లో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం పాలకొండ నియోజకవర్గం ఇంచార్జ్ నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం చేస్తున్న వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.



జయపురంలో ర్యాలీ చేస్తున్న జయకృష్ణ, టిడిపి నాయకులు

నీతి కథలతోనే విద్యార్థుల్లో నైతికత

ప్రజాశక్తి - భామిని

చిన్నతనంలోనే నీతి కథలు చదివినా, విన్న మంచి నైతిక విలువలు అభివృద్ధి చెంది, నైతిక జీవితం విద్యార్థుల్లో అలవడుతుందని స్థానిక మహిళా పోలీస్ చందన విద్యార్థులకు సూచించారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం చిత్రలేఖన నైపుణ్యాలు, నీతి కథలు, పఠనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే చిత్రాలు గీసి, విభిన్న కథలను చదివించి, విరామ సమయం ఎలా సద్వినియోగం చేసుకోవాలి, నైపుణ్యాలు సాధించడం వల్ల మనలో మనకు ఆత్మ విశ్వాసం పెరుగుతుందని లైబ్రయన్ సునీత తెలిపారు. కార్యక్రమంలో 30మంది విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొండ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం రెండవ రోజు మంచి సూక్తులు సాహితీ వేత్త, సహస్ర సన్మాన పత్రాల రచయిత, కవి గారాల సూర్యం మాష్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు మానవత్వ విలువలు పెంపొందించు కోవడానికి ముఖ్య సూక్తులు అవసరమని, ఎక్కువగా 4సిలు మన జీవితాన్ని ప్రభావితం చేస్తాయని, సినిమా, కేబుల్ టీవీ, క్రికెట్, సెల్ఫోన్ వంటివి అతిగా వాడొద్దని అవసరమైన వరకు వాడాలని, పుస్తక పఠనమే మిన్న అని, పుస్తకాలు గ్రంథాలయం ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఎక్కువగా పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంచుకొని ఉన్నతమైన పదవులు పొందుతారని చెప్పారు. ఇతిహాస గ్రంథాలైన మూడు గ్రంథాలు భగవద్గీత, బైబిల్, ఖురాన్ చదివి అన్ని మతాల సమగ్ర సారాలన్నీ తెలుసుకొని ఉన్నతమైన జీవితాన్ని జీవించాలని కోరారు. అతనితో పాటు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు, యోగ గురువు కె.జనార్ధన్‌రావు, ఇంఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్‌బాబు, సహాయకుడు ఈశ్వర్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం రెండో రోజు పిల్లలు గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞానపరమైన పుస్తకాలు చదివారని గ్రంథాలయ అధికారి బి.గణేష్ బాబు తెలిపారు. ఎక్కువ మంది విద్యార్థినులు పాల్గొన్నారు. సహాయకులు రామకష్ణ పాల్గొన్నారు.



భామిని : గ్రంథాలయంలో చదువుకుంటున్న చిన్నారులు

సమస్యలపై రైతులు ఉద్యమించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చైతన్యవంతంతో వుద్యమించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ పిలుపునిచ్చారు. ఎపి రైతు సంఘం జిల్లాప్రథమ మహాసభ రెండవ రోజు జరిగిన ప్రతినిధుల సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. తోటపల్లి కాలువల ఆధునీకరణ పనులకు నిధులు కేటాయించి త్వరగా పూర్తి చేయాలని, వట్టిగెడ్డ, పెద్దగెడ్డ, జంపర్ కోట రిజర్వాయర్ పనులకు నిధులు కేటాయించాలని, లచ్చయ్య పేట షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీన పరచుకోవాలని, జిల్లాలో ప్రజల ప్రాణాలు పంటలు నష్టపెడుతున్న ఏనుగుల సమస్య పరిష్కారానికి జిల్లా ప్రజా ప్రతినిధులు చాలా తీసుకోవాలని కోరారు. ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రెజలర్ల చేస్తున్న ఆందోళనకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మద్దతు తెలుపుతుందని, ఆ సంస్థ చైర్మన్ తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు నెలకొల్పాలని, జిల్లాలో కోల్డ్ స్టోరేజెస్ ఏర్పాటు చేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చే రుణాలు ఇవ్వాలని, పై తీర్మానాల అమలుకు భవిష్యత్తులో జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెలగాడ శ్రావణ్ కుమార్, బుడితి అప్పలనాయుడు తెలిపారు.అనంతరం నూతన కమిటీ ఏర్పాటు 21 మందితో జిల్లా సమితి ఏర్పాటైంది.

15న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - కొమరాడ

ఉపాధి హామీ వేతనదారుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 15న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివున్నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు కొమరాడ, బంగారంపేటలో ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివున్నాయుడు, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ వామపక్షాలు, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజాసంఘాల పోరాటాలతో సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని ప్రస్తుత బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసుందుకు కుట్రపన్నుతోందన్నారు. ఇందులో భాగంగా ఈ చట్టానికి ఏడాదికి ఏడాది నిధుల కోత పెడుతుందని విమర్శించారు. అంతేకాక రెండు పూటల పనిదినాలు పెట్టి కూలీలను ఇబ్బందుకు గురిచేస్తుందన్నారు. సకాలంలో వేతనాలు చెల్లించడంలేదని, కూలి గిట్టుబాటు కావడంలేదని అన్నారు. ఈ సమస్యలన్నింటిపైనా ఈనెల 15న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో వేతనదారులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

నర్సిపురంలో పండగ సందడి

పార్వతీపురంరూరల్ : మండలంలోని నర్సిపురం, కారాడవలస, విశ్వంభరపురంలో స్థానిక గ్రామదేవతలైన అగ్నిగంగమ్మ, దుర్గమ్మ, దేశితల్లిల వారాల పండగలు నిర్వహిస్తుండడంతో సందడి వాతావరణం నెలకొంది. దూరప్రాంతాల నుంచి బంధువులు, మిత్రులను ఆహ్వానించడంతో ఆయా గ్రామాలు జనసమ్మర్థంగా మారాయి.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి -భామిని

స్థానిక ఆదర్శ పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరం గానూ ఆరో తరగతి ప్రవేశాలకు విద్యార్థులు www.cse.ap.gov. In లో నిర్ణీత పరీక్ష రుసుం చెల్లించి ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ రఘు పాత్రుని శివకుమార్ తెలిపారు. ఆదర్శ పాఠశాలలో ఆరోతరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జూన్ 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని, అగ్రవర్ణ పేదలకు ఇడబ్లుఎస్ ద్వారా రిజర్వేషన్ సదుపాయం ఉందన్నారు. పూర్తి వివరాలకు 9440322964, 9502579287 కి సంప్రదించవచ్చు అని తెలిపారు.

నేడు మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - సీతానగరం

ఈనెల 10న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి బి.రమణమ్మ అధ్యక్షతన జరుగుతుంది. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులంతా పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఎంపిడిఒ ఎంఎస్ ఎల్ఎన్ ప్రసాద్ కోరారు.



విజయం సాధించిన గుమ్మలక్ష్మీపురం జట్టుసభ్యులు

గుమ్మలక్ష్మీపురం క్రికెట్ టీమ్ విన్నర్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం అంతర్ మండలాల క్రికెట్ టోర్నమెంట్‌లో గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన కొండవీధి క్రికెట్ టీం ఘన విజయం సాధించింది. సుమారు 60 టీములు పాల్గొన్న టోర్నమెంట్లో కొండవీధికి చెందిన యువత ఫైనల్లో విజయం సాధించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో యువత టోర్నమెంట్లో గెలుపొందిన మెమొంటోలను చేతపట్టుకుని ద్విచక్ర వాహనాలపై వీధి వీధినా తిరుగుతూ ఆనంద ఉత్సవాలను జరుపుకున్నారు. ఈ మేరకు అంతర్ మండలాల్లో క్రికెట్ టోర్నమెంట్లో ఘన విజయం సాధించిన క్రికెట్ టీం సభ్యులను సర్పంచ్ బొత్తాడ గౌరీశంకర్రావు, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, ఉప సర్పంచ్ కిషోర్ కుమార్, గ్రామస్తులు తదితరులు హర్షవ్యక్తం చేశారు.

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో ఆకాలంగా కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించి ఆదుకోవాలని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి జగదీశ్వరి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మండల పార్టీ అధ్యక్షులు శానపతి శేఖర్ పాత్రుడు ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ మండలంలో పాలెం, మాదలంగి పంచాయతీల్లో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రబీలో రైతులు పండించిన మొక్కజొన్న, ఉద్యానపంటలు అరటి, పామాయిల్, జీడి మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. అధికారులు తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోయిన రైతులకు పంటనష్టం, క్రాప్ ఇన్సూరెన్స్ ఇవ్వలిసిందిగా కోరారు. పంటలపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు అకాల వర్షాలు, ప్రకృతి కన్నెర్ర చేయడంతో ప్రతి సీజన్లో నష్టపోతున్నారని అన్నారు. నష్టపోయిన పంటలకు అధికారులు వచ్చి పరిశీలించి వెళ్తున్నారు తప్ప ఎటువంటి పరిహారాలు అందరం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో ఒకవైపు నదులు ఉప్పొంగే సమయంలో అధిక వర్షాలతో ఇప్పటికే చాలామంది రైతులు నష్టపోయారన్నారు. మెరువైపు ఏనుగుల సంచారంతో వేల ఎకరాల పంటల నాశనమవుతున్నా ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. చేందుకు ప్రభుత్వం అన్నారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు మధుసూధనరావు తెలుగురైతు అధ్యక్షులు వెంకటనాయుడు, జెడ్పి మాజీ ఛైర్మెన్ సుదర్శనరావు, సీనియర్ నాయకులు పొట్నూరు వెంకట నాయుడు, కృష్ణబాబు, పడాల హరి, భాను, తదితరులు ఉన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు



బోరులను తవ్విస్తున్న జనసేన నాయకులు రిషవర్ధన్

పెద్ద గైశీలలో బోరు ఏర్పాటు

ప్రజాశక్తి -మక్కువ

మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీ పెద్ద గైశీలలో జనసేన మండల పార్టీ అధ్యక్షులు గేదెల రిషవర్ధన్ తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. గ్రామస్తులు అనేక ఏళ్లగా తాగునీటికి ఇబ్బందులకు గురవుతున్నారన్న విషయం తెలుసుకున్న ఆయన గ్రామస్తులతో మాట్లాడి తాగునీటి సమస్య తీరుస్తానని గతంలో హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు తన సొంత నిధులతో బోరుబావి వేయించి గ్రామస్తులకు తాగునీటి కొరత లేకుండా చేశారు. త్వరలో బోరుకు మోటారు, ట్యాంకు కూడా త్వరలో నిర్మిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. తమ సమస్యను ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని, ఏళ్ల తరబడి పని అవుతుందని చెప్పడమే ఆచరణలో అమలు కాలేదని గ్రామస్తులు తెలిపారు. తమ ఇబ్బందులను తెలుసుకొని బోర్లు ఏర్పాటు చేసిన రిషవర్ధన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వెంపడాపు సుగుణేశ్వరరావు, మజ్జి గణపతి, మజ్జి లక్ష్మణరావు, వెంపడాపు బంగారునాయుడు, సిగనాపురి బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -పాలకొండ రూరల్

మండలంలోని వాటపాగు గ్రామ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతికి గ్రామస్తుల సమస్యలు చెప్పుకున్నారు. సదరు సమస్యల్లో ముఖ్యమైనవి గుర్తించి గ్రామ సర్పంచ్‌ల సహాయంతో వాటపాగు సచివాలయం పరిధిలో గల 3 గ్రామాలైన అట్టలి, వాటపాగు, పద్మపురంలో 9పనులను గుర్తించారు. పనులు ప్రారంభించడానికి వాటపాగు సర్పంచ్ రాజారావు, వైస్ సర్పంచ్ లక్ష్మ నాయుడు, అట్టలి సర్పంచ్ సంధ్యారాణి మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వాటపాగు, అట్టలి కార్యదర్శులు గోవిందరావు, మన్మథరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కనిష్క వర్ధన్, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

అమ్మవారి పండగలో వైద్యశిబిరం

ప్రజాశక్తి - సీతానగరం

మండల కేంద్రంలో మంగళవారం జరుగుతున్న బోగితల్లి అమ్మవారు పండుగ సందర్భంగా వైద్య సిబ్బంది వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సందర్శించారు. శిబిరంలో ఉంచిన మందులు, బిపి, షుగరు, జ్వరం మొదలగు పరీక్షలు, ప్రథమ చికిత్స కిట్లను పరిశీలించారు. ఒపి నిర్వహణ రికార్డులో నమోదు చేసిన రోగుల వివరాలు పరిశీలించారు. అనంతరం 104 వాహనంలో అత్యవసర సందర్భాల్లో ఉపయోగపడే పరికరాలు, మందులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవం సందర్భంగా జన సమూహం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలకు వైద్య పరంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు రీత్యా వైద్య శిబిరం, అలాగే బస్టాండు, జనం రద్దీగా ఉండే సెంటర్లలో ప్రథమ చికిత్స స్టాల్స్‌ను వైద్య సిబ్బంది ఏర్పాటు చేశారు. పిహెచ్‌సి కూడా అందుబాటులో ఉండడం వల్ల ఏమైనా అత్యవసర కేసులు వస్తే ఎటువంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి డిఐఒ జగన్మోహనరావు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ పి.ఉషారాణి , డాక్టర్ నిహారిక, సిహెచ్ఒ ఈశ్వరమ్మ, సూపర్ వైజర్ సింహాచలం, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది దుర్గా ప్రసాద్, ప్రసాద్, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

స్నేహితుడి తల్లి వైద్యం కోసం ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

1994-95లో పదో తరగతి చదువుకున్న స్నేహితుల్లో సింగం కుమార్ అనే స్నేహితుడి తల్లికి కేన్సర్ వ్యాధి సోకిందని తెలుసుకున్న తోటి స్నేహితులు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకొచ్చారు. ఇందులో భాగంగా గుమ్మలక్ష్మీపురం గడ్డికాలనీలో నివాస ఉంటున్న సింగం కుమార్ ఇంటికి వెళ్లి సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్రావు, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్ చేతుల మీదుగా రూ.42వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేమంతా గుమ్మలక్ష్మీపురం జడ్పీహెచ్ స్కూల్లో చదువుకున్నామని, స్నేహితుడు తల్లి అనారోగ్యంతో బాధపడుతుందని తెలిసి ఆర్థికంగా ఆదుకునేందుకు ముందుకు వచ్చామని పైడా నాగేశ్వరరావు, కోరాడ మన్మధరావు, సురేష్, వెంకటరావు తెలిపారు.

రోగికి సాయం

ప్రజాశక్తి - మెంటాడ:

మండలంలోని ఉద్దంగి పంచాయితీ పరిధిలో గల పులి గుమ్మిలోవ గ్రామంలో మెంటాడ అప్పలనాయుడు గత కొంత కాలంగా పక్షవాతంతో కదలల్లేని పరిస్థితిలో ఉన్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాతృభూమి సేవా సంఘం సభ్యులు గౌరినాయుడు స్పందించి మంగళ వారం బాధితునికి వీల్ చైర్, ఒక నెలకు సరిపడా సరుకులు అందించారు. ఈ సందర్భంగా మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఇలవలస గోపాలరావు మాట్లాడుతూ ఆదరణ లేని పేదలను ఆదుకుంటున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వర్ ప్రసాద్, విజయనగరం గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సభ్యులు మహేష్, మెంటాడ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ ప్రకటన

పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం జిల్లాల్లో కార్బన్ క్రెడిట్ ప్రోగ్రాంలో పనిచేయుటకు 50 మంది అభ్యర్థులు కావలెను. కనీసం పదవ తరగతి పాసై ఉండాలి. వీరికి తప్పనిసరిగా సొంత మోటార్ సైకిల్, టచ్ సెల్ ఉండాలి. వీరికి నెలకు రూ. 15,000-00 ఇవ్వబడును. సామర్థ్యాన్ని బట్టి 15 సంవత్సరములు కొనసాగించబడును. కావున నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోగలరు.

ఇట్లు
CH. SIMHACHALAM, SMART
Choppabutchammapeta,
Makkuva Mandal,
Parvathipuram Manyam Dist.
Cell: 7671030064



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణమూర్తి

విజ్ఞానమే సమస్య పరిష్కారానికి మార్గం

కురుపాం : విజ్ఞానంతోనే సమస్యలు పరిష్కారమయ్యే మార్గం తెలుస్తుందని మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి అన్నారు. మండలంలోని గుజ్జువాయి పంచాయతీ ఎగువకొత్తగూడలో మంగళవారం జన విజ్ఞాన వేదిక జిల్లా సంయుక్త కార్యదర్శి కొండగొర్రి చిన్నారావు ఆధ్వర్యంలో గిరిజనులకు అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి మార్గంలో ప్రయాణించాలని, జెవివి సదస్సులు గిరిజన ప్రాంతాల్లో విస్తతంగా నిర్వహించేందుకు గిరిజన యువత సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జెవివివ్యవస్థాపక సభ్యులు డాక్టర్ ఎంవీఆర్ కష్ణాజీ మాట్లాడుతూ పేదల ఆర్థిక వ్యవస్థ మెరుగుపడాలంటే ప్రతి ఒక్కరి ఇంట్లో చదువుకునే వారు ఉండాలని, దాని ద్వారా పేదరికం నుంచి బయట పడగలమని అన్నారు. కురుపాం ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో గిరిజన మహిళలు ఎక్కువగా రక్తహీనతతో బాధపడుతున్నారని కావున అటువంటి వాటిని మహిళలు ఎదుర్కోవాలంటే ఆకుకూరలు, పౌష్టిక ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెవివి సభ్యులు పి.రంజిత్ కుమార్, జిల్లా కార్యదర్శి డి.చంద్ర మౌళి, గ్రామ సర్పంచ్ హెచ్.నాగేశ్వరరావు, గ్రామపెద్దలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

బైకును తప్పించబోయి వ్యాను బోల్తా

8మందికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కె.శివడ పంచాయతీ, శిఖలపాయి సమీపాన మలుపు వద్ద బైక్‌ను తప్పించబోయి మ్యాక్స్ పికప్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారిని స్థానికుల 108 సహాయంతో భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. గాయపడిన వారిలో కల్లిటి గ్రామానికి చెందిన ఆరిక బాబురావు, సీమల నీలమ్మ, చంద్రయ్య, ఆరిక మనోజ్, భీమన్న ఉన్నారు. వారిలో 8 మందికి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. వివాహానికి గ్రామస్తులు మ్యాక్స్ పికప్ వాహనంపై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. ఎల్విన్‌పేట ఎస్ఐ షణ్ముఖరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్తపై కోపంతో భార్య ఆత్మహత్యాయత్నం

పార్వతీపురంరూరల్ : కొమరాడ మండలం బల్లపాడుకు చెందిన పువ్వుల బోడియ్యమ్మ భర్త సింగు తాగుడుకు బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడంతో తాగుడుమానివేయమని ఎంతచెప్పినా వినకుండా పూర్తిగా మద్యానికి బానిసగా మారాడు. ఈ క్రమంలో మంగళవారం తాగొచ్చి తాను చచ్చిపోతే ఆస్తి బయటవారికి చెందేలా రాసేస్తానంటూ బెదిరింపులకు దిగడంతో మనస్తాపం చెందిన బోడియ్యమ్మ ఇంట్లో ఉన్న పురుగుల మందును కలుపుకుని తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. వెంటనే స్పందించిన కుటుంబీకులు 108 వాహనంతో జిల్లా అసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పార్వతీపురంరూరల్ : మండలంలోని నర్సిపురం పంచాయతీ విశ్వంభరపురానికి చెందిన కంట గౌరి తన భార్యతో కలిసి మంగళవారం ఉదయం ఇంటిసరుకులు కొనుగోలు నిమిత్తం ద్విచక్రవాహనంపై నర్సిపురం వచ్చారు. అనంతరం తిరిగి తన ఇంటికి వెళుతుండగా, విశ్వంభరపురం మలుపులో పార్వతీపురం-బొబ్బిలి రహదారిపై ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో భార్యభర్తలిద్దరికి గాయాలయ్యాయి. స్పందించిన కారు యజమాని వారిని జిల్లా అసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

వ్యాను ఢీకొని వ్యక్తికి గాయాలు

పార్వతీపురంరూరల్ : పట్టణంలోని పాత రెల్లివీధికి చెందిన సింగుకిరణ్ అనే వ్యక్తి మంగళవారం తన మిత్రులు జయేంద్ర, పవన్‌కుమార్‌తో కలిసి కొత్తవలస నుంచి పార్వతీపురం ఫ్లైఓవర్ మీద ప్రయాణిస్తుండగా, వెనుక నుంచి బొలెరా వాహన వేగంగా వచ్చి ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. అందులో కిరణ్ ఎక్కువగా గాయపడడంతో స్థానికులు 108 వాహనంలో జిల్లా అసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.